ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలి

- శ్రీకాంత్, అంగోత్ ప్రియాంకల వివాహానికి హాజరైన అరుణోదయ విమలక్క, బైరి నరేష్

6



మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న దంపతులు

సంక్షేమ పథకాలను వివరించండి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి జూపల్లి నిర్దేశం

6



బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

బాల్యానికి బంధం వద్దు

- బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యేక కమిటీలతో అవగాహన సదస్సులు
- ప్రతీ గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు

కబడ్డీ చాంపియన్ వనపర్తి



ట్రోఫీ అందుకుంటున్న కబడ్డీ చాంపియన్ వనపర్తి జట్టు

7



ఆగారం గ్రామంలో పోలింగ్ కేంద్రంగా వంట గది

వంట గదిలో ఓటింగ్..!

- పోలింగ్ కేంద్రాలుగా వరండాలు, కిచెన్ రూంలు
- ఒకే గదిలో రెండు పోలింగ్ కేంద్రాలు
- మూతబడిన బడులను తెరుస్తున్న అధికారులు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో ఓటింగ్ కోసం వంట గదులు కూడా సరిపోవడం లేదు. మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను ఓపెన్ చేసి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పాఠశాలలోని ఒకే గదిలో రెండు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కోసం కట్టెల పొయ్యిపై వంట చేయడంతో పొగబారిన వంట గదులకు రంగులు వేసి ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలో 29 గ్రామాలు, 248 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. కర్ని తండా, కోతుల కుంట తండా సర్పంచు స్థానాలు, 16 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో 27 సర్పంచ్ స్థానాలు, 232 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు 232 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించనున్నారు. మండలంలోని అంతాయిపల్లి ప్రభుత్వ పాఠశాల మూతపడడంతో 2 కుటుంబాలు నివాసం ఏర్పరుచుకున్నాయి. ఎన్నికల నేపథ్యంలో వారిని ఖాళీ చేయించి మరమ్మతులు చేపట్టారు. ఆగారం గ్రామంలోని ప్రభుత్వ బడిలో 4 గదులు మాత్రమే ఉన్నాయి. గ్రామంలో 8 వార్డులలో 783 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు గదులు సరిపడా లేకపోవడంతో ఇరుకైన వంట గది, వరండాలో సైడ్ వాల్స్‌తో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. వంటగదికి రంగులు వేసి మెరుగులు దిద్దుతున్నారు. వసురాం తండా, సూర్యతండా, దేవబండ తండాలు కలిపి కొత్తగా వసురాం తండా గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామంలో 6 వార్డులో 367 మంది ఓటర్లు ఉన్నారు. పాఠశాలలో 2 గదులు మాత్రమే ఉన్నాయి. ఒక్కో గదిలో 2 పోలింగ్ కేంద్రాలు, వరండాలో 2 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ అధికారులు కూర్చోవడానికి సరైన వసతులు లేవు.

ఎన్నికల నాటికి సౌకర్యాలు కల్పిస్తాం..



పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నాటికి పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తాం. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే వంట గది, పాఠశాల వరండాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులు ఉంటే సరి చేస్తాం. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తాం.

- విజయ్ సింహారెడ్డి, ఎంపీడీవో, ఖిల్లాఘణపురం



వసురాం తండాలో 6 పోలింగ్ కేంద్రాలు నిర్వహించే పాఠశాల

పార్టీల్లేవ్.. జెండాల్లేవ్..

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలు పంచాయతీల్లో విచిత్ర పరిస్థితి

- కలిసి పోటీ చేస్తున్న పలు పార్టీలు
- బీఆర్ఎస్, బీజేపీ జత కట్టినవే అధిక స్థానాలు
- సర్పంచు ఒకరికైతే.. ఉప సర్పంచు మరొకరికి.. వార్డు స్థానాలు చెరి సగం
- ఒకరి కంటే ఎక్కువ మంది పోటీ చేస్తున్న కాంగ్రెస్ మద్దతుదారులు
- స్థానికంగా ఉండే పరిస్థితుల ఆధారంగా అభ్యర్థులకు పార్టీల ప్రాధాన్యం



నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం కల్వకోలులో సీపీఐ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్

మహబూబ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల్లో పాదర్శకత కోసం.. అభ్యర్థుల వ్యక్తిత్వం, వారికి స్థానిక ప్రజల పట్ల ఉన్న నిబద్ధతకు కొలమానంగా పార్టీల గుర్తులతో కాకుండా స్వతంత్ర గుర్తులను కేటాయించి, పోటీలో నిలుపుతారు. స్వయం ప్రతిపత్తిగా పనులు చేసుకోవడం ఇందులో భాగం. అయితే ఈ ఎన్నికల ప్రక్రియలో అధికారికంగా పార్టీ గుర్తులు లేనట్లే కానీ. ఎక్కువ శాతం పార్టీల వారీగానే అభ్యర్థుల విభజన, ప్రజల మద్దతు అన్నీ ఉంటున్నాయి. ఒకవేళ స్వతంత్రంగా గెలిచినప్పటికీ, తర్వాత ఏదో పార్టీలో చేరితే కానీ రాజకీయ లక్ష్యాలు, నిధులు తెచ్చుకోవడానికి ఇబ్బంది ఉండదు. ఇన్ని పరిస్తితులు ఉన్నప్పటికీ కొన్ని పంచాయతీల్లో ఇప్పటికీ అభ్యర్థి గుణగణాలకే ప్రాధాన్యమిస్తున్నట్లు కనిపిస్తోంది. అందుకే పార్టీలు, జెండాలతో సంబంధం లేకుండా పలు గ్రామాల్లో ఇరుపార్టీలు పొత్తులతో పోటీలో ఉంటున్నాయి. అభ్యర్థులను అవగాహనతో నిలిపి.. పదవులను పంచుకుంటున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ పొత్తులు ఉమ్మడి జిల్లాలో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సీపీఐ నాయకులకు ఇతర పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి.

బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు..

పార్టీల ముఖ్య నాయకుల స్థాయిలో కాకుండా ఆయా పంచాయతీల స్థాయిలో ఎన్నికల్లో పార్టీల కార్యకర్తల మధ్య మద్దతు కనిపిస్తోంది. ప్రధానంగా బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ పొత్తులు ఎక్కువగా ఉంటున్నాయి. గండీడ్ మండలంలోని రెండు గ్రామాల్లో బీజేపీ బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తోంది. ఒక గ్రామంలో బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతోంది. మహమ్మదాబాద్ మండ లం వెంకటొరెడ్డిపల్లిలో గతంలో కాంగ్రెస్ బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వగా.. ప్రస్తుతం కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మద్దతు ఇస్తోంది. సీసీకుంట మండలంలోని నాలుగు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు బీజేపీ మద్దతు ఇస్తోంది. ఉప సర్పంచు బీజేపీకి, వార్డులు చెరిసగం పంచుకుంటున్నారు. నారాయణపేట జిల్లాలో కోటకొండ, అభంగాపూర్, తిర్మలాపూర్ లలో బీఆర్ఎస్ బీజేపీ పొత్తుతో బీఆర్ఎస్ మద్దతుదారులు బరిలో ఉన్నారు. సర్పంచు, ఉపసర్పంచు పదవులు పంచుకుంటున్నారు. కోటకొండలో సీపీఐఎంఎల్ అభ్యర్థితో కాంగ్రెస్, సీపీఎం పొత్తు పెట్టుకున్నాయి. సర్పంచు మాస్‌లైన్‌కు.. ఉప సర్పంచు సీపీఎంకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. దామరగిద్ద మండలం ఉడ్మల్‌గిద్దలో స ర్పంచు సీపీఎంకు, ఉపసర్పంచు కాంగ్రెస్ పంచు కుని బరిలో ఉన్నాయి. ఉట్కూరు మండలం బిజ్వార్, చిన్నపొర్లలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు కుదుర్చుకున్నాయి. నర్వ మండల కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మద్దతుదారులు అంతర్గత పొత్తు లో ఉండగా.. సర్పంచు కాంగ్రెస్‌కు, ఉప సర్పంచు స్థానం బీజేపీకి పంచుకున్నారు. కృష్ణ మండలం ఖాన్‌దొడ్డి, మరికల్ మండలం పల్లెగడ్డ, కన్మనూ రు, బుడ్డెగాన్ తండా, రాకొండలలో బీఆర్ఎస్, బీజేపీలు పొత్తు కురుర్చుకోగా.. ఎలిగండ్లలో కాం గ్రెస్, బీఆర్ఎస్ జతకలిశాయి. వనపర్తి జిల్లా చిన్నంబావి

(మిగతా 6లో..)

ఉమ్మడి జిల్లాలో 1,678 పంచాయతీలు

ఉమ్మడి జిల్లాలో 1,678 పంచాయతీలు, 15,077 వార్డులకు ఎన్నికలు జరుగుతున్న విషయం తెలిసిందే. మూడు విడతలుగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో ఇప్పటివరకు రెండు విడతలకు సంబంధించి అభ్యర్థుల తుదిజాబితా వెల్లడైంది. వారంతా ప్రచారంలోకి దిగిపోయారు. కొన్ని పంచాయతీలు ఏకగ్రీవం కాగా.. అందులో మెజారిటీ తక్కువ ఓట్లు ఉన్న తండా పంచాయతీలే కావడం గమనార్హం. ఇప్పుడు పార్టీల పొత్తులు ఉన్నచోట అభ్యర్థులు ఉమ్మడిగా ప్రచారం చేస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ 100 శాతం స్థానాల్లో పోటీ చేస్తోంది. ఈసారి స్థానిక ఎన్నికల్లో బలంగా సత్తాచాటాలని భావించిన బీజేపీ 40 శాతం స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను నిలిపింది. మిగతా స్థానాల్లో బీజేపీ కేడర్ బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతోంది.



వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం బెక్కెంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

జోరుగా మద్యం విక్రయాలు

- ఓటర్లను ఆకర్షించేందుకు పోటీ పడుతున్న అభ్యర్థులు
- బెల్ట్ దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు
- వైన్ షాపులపై నిఘా పెట్టాలంటున్న స్థానికులు
- ఇప్పటికే నమోదైన 60 కేసులు

గద్వాల క్రైం, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి):సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. నాయకులు ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు మద్యం మత్తులో ముంచుతున్నారు. బెల్టు దుకాణాలలో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. పోలీసులు జిల్లా కేంద్రంలోని వైన్‌దుకాణాల దగ్గర నుంచి మద్యం ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేస్తున్న వారిపై నిఘా పెట్టినా.. ఏదో ఒక మార్గంలో బెల్టు షాపులకు చేరుతోంది.



పూడూరు స్టేజీ సమీపంలో పట్టుకున్న మద్యం కాటన్లు(ఫైల్)

ఎన్నికల్లో మద్యం పాత్ర కీలకం

జోగుళాంబ గద్వాల జిల్లాలో సర్పంచ్ ఎన్నికల పుణ్యమా అని మద్యం అమ్మకాలు జోరుందుకున్నాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఇచ్చే మొదటి నజరానే మద్యం. ప్రతీ రోజు మూడు పూటల ఫుల్‌గా మద్యం పంచుతున్నారు. కొంతమంది ఓటర్లకు డబ్బులు ఇవ్వకున్నా ఫర్వాలేదు కానీ మద్యం ఇవ్వాలనే డిమాండ్ వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో కొందరు అభ్యర్థులు ముందుగానే గ్రామాల్లో తమకు సంబంధించి వారి ఇళ్లల్లో మద్యం నిల్వ ఉంచినట్లు తెలుస్తోంది. ఏదీ ఏమైనా ఈ సర్పంచు ఎన్నికల పుణ్యమా అని మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రతీ గ్రామంలో దాదాపు 5 నుంచి 6 బెల్టు దుకాణాలు ఉన్నా. అన్ని దుకాణాలలో అమ్మకాలు జోరుగా నడుస్తున్నాయి.. కానీ క్వార్టర్‌పై రూ. 50 దాకా అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో బెల్టు దుకాణాల నిర్వాహకులు విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పలుచోట్ల అక్రమంగా రవాణా చేస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. మల్దకల్ మండలంలో 91.46 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 12 కేసులను నమోదు చేసినట్లు మల్దకల్ ఎస్ఐ నందికర్ తెలిపారు.

కేసులు నమోదు చేస్తున్నాం



ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. బెల్టు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఇప్పటికే 60 కేసులు నమోదు చేశాం.

- టంగుటూరి శ్రీను, సీఐ

రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించే వరకు పోరాటం ఆగదు

చారకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) డిండి - నార్లాపూర్ ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలోని గోకారం వద్ద చేపట్టిన రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించే వరకు పోరాటం ఆగదని ఎర్రవల్లి, ఎర్రవల్లితండా ప్రజలు, భూ నిర్వాసితులు అన్నారు. గ్రామస్థులు, భూనిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా భూ నిర్వాసితుడు ప్రకాశ్ మాట్లాడుతూ రిజర్వాయర్‌తో ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని వాపోయారు. గోకారం చెరువును కూల్చివేసి నిర్మించే రిజర్వాయర్‌తో స్థానిక రైతులకు ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం పుణరాలోచన చేసి రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి తమ గ్రామాలు ముంపునకు గురికాకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎరవల్లి, ఎర్రవల్లితండా గ్రామస్థులు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న భూ నిర్వాసితులు

వార్డులన్నీ ఏకగ్రీవం.. సర్పంచ్ పదవికి మాత్రమే పోటీ

7

ఓటర్లకు సకల మర్యాదలు

- తెల్లారక ముందే ఇంటి ముంగిట్లో ప్రత్యక్షం
- కాళ్లబేరాలకూ వెనుకాడని వైనం
- ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తుకు పై ఎత్తులు

7

వలస ఓటర్లపై నజర్

- ప్రతీ ఓటు గెలుపునకు కీలకమే

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 141.00
హోల్ సేల్	: 149.00
డ్రెస్డ్	: 254.00
స్కిన్ లెస్	: 277.00

జనంతో కిక్కిరిసిన జాతర

జోరందుకున్న వ్యాపారాలు

మల్దకల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ పట్టణంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివా రం ముగిశాయి. కానీ జాతరకు మాత్రం భక్తులు పోటెత్తారు. ఆదివా రం సెలవు కావడంతో వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు భారులు తీరారు. భక్తి శ్రద్ధలతో దాసంగం తయారు చేసి దేవదేవుడికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. జాతరలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడు తున్నాయి. పిల్లల కోసం ఏర్పాటు చేసిన రంగులరాట్నం, బొమ్మల దుకాణాలలో విరివిగా వ్యాపారం జరుగుతోంది.



జనంతో కిటకిటలాడుతున్న మల్దకల్ క్షేత్రం

వికసించని రాజీవ్ యువవికాసం

- గంపెడాశలు పెట్టుకున్న పథకంపై కమ్ముకున్న నీలినీడలు
- నెలలు గడుస్తున్నా.. పథకంపై ఊసెత్తని ప్రభుత్వం
- రుణాలతో స్వయం ఉపాధికై ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు ఆవిరి
- జిల్లా వ్యాప్తంగా యూనిట్లు 7,681, దరఖాస్తులు 25,669



6

మైసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు



మైసమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమరగిరిలో అక్కా, తమ్ముడు పోటీ

- అక్క కాంగ్రెస్, తమ్ముడు రెబల్
- కుటుంబంలో పంచాయతీ ఎన్నికల కుంపటి

7

మైసమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో భక్తుల కొంగుబంగారంగా వెలిసిన మైసమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ ఆదివారం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల, వనపర్తి జిల్లాల నలుమూలల నుంచి కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శనం చేసుకుని నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల నుంచి టికెట్లు, హుండీ ద్వారా 1,89,875 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, ఈవో రామేశ్వర శర్మ తెలిపారు.

ప్రేమ వివాహాలను ప్రోత్సహించాలి

- శ్రీకాంత్, అంగోత్ ప్రియాంకల ఆదర్శ వివాహంలో బైరి నరేష్
- హాజరైన అరుణోదయ విమలక్క, ప్రజా కళాకారుడు సంజీవన్న



మూఢ నమ్మకాల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్న దంపతులు, హాజరైన ప్రముఖులు

అమ్రాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేటి ఆధునిక సమాజంలో యువత కులాంతర, ప్రేమ వివాహాలు చేసుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ బైరీ నరేష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్‌లోని ఎంకే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ బైరీ నరేష్ ఆధ్వర్యంలో స్వాభిమాన కులాంతర ప్రేమ వివాహాన్ని ఆదివారం నిర్వహించారు. ఇరువర్గాల బంధుమిత్రులతో పాటు బుద్దిస్ట్, పూలే, అంబేడ్కర్ సంఘాల నాయకుల సమక్షంలో ఘనంగా జరిపారు. అమ్రాబాద్ మండల పరిధిలోని మాచారం గ్రామానికి చెందిన యాట శ్రీకాంత్, ఖమ్మం జిల్లాకు చెందిన అంగోత్ ప్రియాంకల ప్రేమ వివాహాన్ని ఇరు కుటుంబాల పెద్దల అంగీకారం మేరకు మూఢనమ్మకాల నిర్మూలన సంఘం సహకారంతో ఈ ఆదర్శ వివాహాన్ని వీరిద్దరు చేసుకున్నారు. శ్రీకాంత్ అచ్చంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ బీసీ గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రియాంక జర్నలిజంలో పోస్టు గ్రాడ్యుయేట్ చేసి సివిల్స్ ప్రిపరేషన్‌లో ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత ప్రేమ వివాహాలు చేసుకుని ఆదర్శంగా నిలవాలని పలువురు వక్తలు కోరారు. ఈ కార్యక్రమానికి బైరీ నరేష్‌తోపాటు గాండ్ల సుజాత, అరుణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క, ప్రజా కళాకారుడు సంజీవన్న, జక్క గోపాలు, బుడిగమల మురళి, వివిధ పార్టీల, సంఘాల నాయకులు హాజరయ్యారు.

కేఎల్‌ఐ కాల్వపై తరచూ ప్రమాదాలు

- ఇరుకు వంతెనతో అవస్థలు



తుమ్మలసూగురు గ్రామ సమీపంలో కేఎల్‌ఐ కాల్వపై ప్రమాదాలకు నెలవుగా మారిన వంతెన

తాడూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ప్రధాన కాల్వ గ్రామాన్ని అనుసరించుకుని ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో తుమ్మలసూగురు, యత్మతాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి అనుసరించి కాల్వపై వంతెన నిర్మించారు. వంతెన భూమికి దాదాపుగా 25ఫీట్ల ఎత్తులో ఉండడం మూలంగా వంతెనపై ఎక్కేందుకు మట్టి పోసి రహదారిని ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో వంతెనపై ఎక్కాలన్నా, దిగాలన్నా ఎక్కువ ఎత్తుల ఉండడం మూలంగా లోడ్‌తో వచ్చే వాహనాలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ వంతెన వద్ద భారీ వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు పంచాయతీరాజ్ అధికారులు స్పందించి కేఎల్‌ఐ కాల్వపై ఉన్న వంతెన వద్ద రాకపోకలు సజావుగా కొనసాగే విధంగా రహదారిని మరింత వెడల్పుగా చేసి వాహనాల రాకపోకలు సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శోభాయమానంగా సత్యసాయి ప్రేమ వాహిని యాత్ర



కొల్లాపూర్ పట్టణంలో పుట్టపర్తి సత్యసాయిబాబా వాహిని యాత్రకు హాజరైన భక్తులు

కొల్లాపూర్/ కోడేరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పుట్టపర్తి సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న సత్యసాయి బాబా ప్రేమ వాహిని యాత్ర కొల్లాపూర్ నియోజకవర్గంలో సాగింది. తెలుగు రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మీదుగా జరుగుతున్న సత్యసాయిబాబా ప్రేమ వాహిని యాత్ర జిల్లాలో ఆదివారం ప్రారంభమైంది. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి నియోజకవర్గాల మీదుగా ఈ యాత్ర కొనసాగనుందని జిల్లా కన్వీనర్ గుబ్బ శంకర్ తెలిపారు. కొల్లాపూర్, కల్వకోల్, కోడేరు గ్రామాల్లో సత్యసాయి బాబా ప్రేమ వాహిని యాత్ర వాహనానికి భక్తులు, గ్రామస్థులు పెద్దఎత్తున హార తులతో స్వాగతం పలికారు. వాహనంతో భాజాభజంత్రీ భక్తి గీతాలతో గ్రామంలో పెద్ద ఎత్తున భక్తులు ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం వరకు ఆయా గ్రామాల్లో ఘనంగా ఊరేగింపు నిర్వహించి వాహనాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో సాగనంపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీస్ కోకన్వీనర్ లక్ష్మణ్‌బాపు, కొల్లాపూర్ కన్వీనర్ శ్రీనివాసులు, కల్వకోల్ కన్వీనర్ సత్యనారాయణ, కోడేరు కన్వీనర్ రాఘవేంద్ర శర్మ, తీగలపల్లి కన్వీనర్ వీరయ్య శెట్టి, శ్రీనివాసులు శెట్టి, యుగంధర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు యజమానిపై కేసు నమోదు

వనపర్తి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణ పరిధిలోని రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదయిన ఘటన వనపర్తి రూరల్ పోలీసు స్టేషన్ లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. జనవరి 28 నుంచి జిల్లా పౌర సరఫరాల అధికారి జగన్మోహన్ విధులు నిర్వహిస్తున్నాడు. నవంబరు 12న తెలంగాణ రాష్ట్ర హైదరాబాద్ విజిలెన్స్ అధికారులు పౌర సరఫరాల అధికారులతో కలిసి పెద్దమందడి శివారులోని వారాహి రైస్ మిల్, చాముండేశ్వరి రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించారు. అవకతవకలు ఉన్నందున ఆ రైస్ మిల్లుపై పంచ నామా నిర్వహించి రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర హై దరాబాద్ బిజినెస్ వారు సూచించారు. నవంబరు 16న రైస్ మిల్లులపై పంచ నామా చేపట్టారు. ఇది ఇలా ఉండగా... ఈ నెల 2న రైస్ మిల్లర్ యజమాని శివప్రసాద్ రెడ్డి తమ కార్యాలయానికి వచ్చి నానాబూతులు తిట్టాడు అని జిల్లా పౌర సరఫరాధికారి జగన్మోమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు.

వికసించని.. రాజీవ్ యువ వికాసం

- గంపెడాశలు పెట్టుకున్న పథకంపై కమ్ముకున్న నీలినీడలు
- నెలలు గడుస్తున్నా.. పథకంపై ఊసెత్తని ప్రభుత్వం
- రుణాలతో స్వయం ఉపాధికై ఎదురు చూస్తున్న నిరుద్యోగుల ఆశలు ఆవిరి
- జిల్లా వ్యాప్తంగా యూనిట్లు 7,681, దరఖాస్తులు 25,669



గద్వాల సర్కిల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి వారిని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం గతేడాది శ్రీకారం చుట్టిన రాజీవ్ యువ వికాసం పథక అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి. పథకానికి ఎంపికైతే కష్టాలు తొలగిపోతాయన్న గంపెడాశతో నిరుద్యోగ యువత ఉంది. అయితే, పథకంపై ప్రభుత్వం కనీసం ఊసెత్తకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకల రోజు యూనిట్ల రాయితీ మంజూరు పత్రాలు ఎంపికైన లబ్ధిదారులకు అందిస్తారని ఆశించిన నిరుద్యోగులు ప్రభుత్వం ఆ దిశగా నిర్ణయం ప్రకటించలేదు. దీంతో స్వయం ఉపాధి ఆశలు వదులుకున్నారు. నెలలు గడుస్తున్నప్పటికీ పథకం అమలు విషయమై ప్రభుత్వం, జిల్లా అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో రాజీవ్ యువ వికాసం వికసిస్తుందా? లేదా అన్న సందిగ్ధంలో నిరుద్యోగ యువత పడింది.

పథకాలకు అర్హులు వీరే....

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు సామాజిక వర్గాలకు చెందిన వారు కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. దీంతో స్వయం ఉపాధి పొందేందుకు భారీ స్థాయిలో నిరుద్యోగులు ఆయా అర్హత కలిగిన కేటగిరీలలో దరఖాస్తు చేసుకున్నారు.

యూనిట్లు ఇలా...

రాజీవ్ యువ వికాసం పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షల లోపు, పుర పరిధిలో రూ. 2 లక్షల లోపు ఉండేలా నిబంధనలు పెట్టింది. అయితే పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణం అందించనుంది. రూ. 50 వేల వరకు రుణం పొందే వారికి 100 శాతం సబ్సిడీ, రూ. 50,001 నుంచి రూ. 1 లక్ష వరకు 90 శాతం సబ్సిడీ, 10 శాతం బ్యాంకు రుణం, రూ. 1,00,001 నుంచి రూ. 2 లక్షల వరకు 80 శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం, రూ. 2,00,001 నుంచి రూ. 4 లక్షల వరకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం అందుతుంది.

అయితే ప్రధానంగా మైనర్ ఇరిగేషన్ పథకాలకు బ్యాంకు రుణం లేకుండా 100 శాతం పూర్తి రాయితీకి అవకాశం ప్రభుత్వం కల్పించింది.

7,681 యూనిట్లకు... 25,669 దరఖాస్తులు...

రాజీవ్ యువ వికాసం పథకం కింద రుణం పొందేందుకు నిరుద్యోగ యువత భారీ సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడం బట్టి జిల్లాలో నిరుద్యోగ సమస్య ఏ స్థాయిలో ఉందో బోధపడుతోంది. జిల్లాకు వివిధ కేటగిరీల్లో 7,681 యూనిట్లు మంజూరవ్వగా, వారి నుంచి 25,669 దరఖాస్తులు వచ్చాయి. అందులో బీసీలు 13,917 దరఖాస్తులకు (3,765 యూనిట్లు), ఎస్సీలు 8,806 (3,230 యూనిట్లు), ఎస్టీలు 479 (152 యూనిట్లు), ముస్లీం మైనార్టీలు 2,401 (515 యూనిట్లు), క్రిస్టియన్ మైనార్టీలు 66 (19 యూనిట్లు) దరఖాస్తులు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదేశాలు వచ్చిన వెంటనే...



రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ వర్గాలకు చెందిన నిరుద్యోగులు పలు యూనిట్లకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశానుసారం రూ. 50 వేలు, రూ. 1 లక్ష విలువ గల యూనిట్ల ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన(స్క్రూటినీ) పూర్తయింది. ఇంకా రూ. 2 లక్షలు, రూ. 4 లక్షలకు సంబంధించిన యూనిట్ దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉంది. యువ వికాసం పథకం అమలు విషయమై నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఎంపిక చేపడుతాం..

- నుషిత, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి, గద్వాల

సంక్షేమ పథకాలను వివరించండి

- కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మంత్రి జూపల్లి నిర్దేశం



కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో సమావేశమైన మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో జూపల్లి అరుణ్

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ఆరు గ్యారెంటీలను గ్రామాల్లో ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆయన తనయుడు జూపల్లి అరుణ్ సమష్టిగా గ్రామాల వారీగా కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు గెలిచేలా వ్యూహరచన చేశారు. కొల్లాపూర్, పెంట్లవెల్లి, పెద్దకొత్తపల్లి, కోడేరు మండలాల్లో జరిగే రెండో విడత ఎన్నికల్లో 139 గ్రామ పంచాయతీలలో వందకు పైగా స్థానాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచేలా వ్యూహం ఉండాలని అన్నారు. ప్రజాపాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా ప్రజలందరికీ ఎన్నికల అనంతరం దరిచేర్చాలని వారు కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. గ్రామాలలో బీఆర్ఎస్, బీజేపీ జతకట్టినా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి ప్రజల్లో విశ్వాసం చూరగొనాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన మద్దతుదారులకు కార్యకర్తలు మద్దతు పలకాలని అందరు సమష్టిగా కృషి చేసి గ్రామాల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలని పిలుపు నిచ్చారు.

పార్టీల్లేవ్.. జెండాల్లేవ్..

(5వ పేజీ తరువాయి)

మండలం బెక్కెం, వెలగొండ, మియాపూర్, గూడెం, కొప్పునూరు, లక్ష్మీపల్లి, వెల్టూరులో బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందంలో ఉన్నాయి. ఆత్మకూరు మండలం మూలమల్ల, ఆరేపల్లి, పిన్నంచర్ల, మదనాపూర్ మండలంలోని కొత్తపల్లి, అమరచింత మండలంలోని కిష్టంపల్లి, కొంకనవానిపల్లి, పాన్‌గల్ మండలం చిక్కేపల్లి, రేమొద్దుల, శాగాపూర్, కొత్తకోట మండలంలోని పాలెం, అప్పరాల గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ అవగాహనతో పోటీ చేస్తున్నాయి.

కాంగ్రెస్ కిక్కిరిసి..

అసెంబ్లీ ఎన్నికల ముందు వరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ దాదాపు ఖాళీ అయిన పరిస్థితులు కనిపించాయి. ఎప్పుడైతే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందో పార్టీకి జవసత్వాలు వచ్చాయి. పాత నాయకులు ఘర్ వాపసీ కావడం, కొత్తరక్తం పార్టీలో చేరడంతో ఇప్పుడు పంచాయతీ ఎన్నికలకు పోటీ తీవ్రమైంది. కొన్ని నియోజకవర్గాల్లో సయోధ్యతో కొందరిని నామినేషన్లు వేయకముందు, కొందరిని ఉపసంహరణ సమయంలో బుజ్జగించి ఒకే అభ్యర్థి బరిలో ఉండేలా చూశారు. అయినప్పటికీ వర్గపోరు ఉన్న చోట్ల మాత్రం ఒకరి కంటే ఎక్కువ అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో కేవలం కృష్ణమోహన్‌రెడ్డి వర్గం.. సరిత వర్గం అభ్యర్థులే బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ నుంచి 10 నుంచి 15 శాతం చోట్ల మాత్రమే అభ్యర్థులు నిలిచారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే ఎమ్మెల్యేలు, మాజీలు ప్రచారం చేయకుండా అభ్యర్థులపైనే భారం వదిలేస్తున్నారు. గెలిచి వచ్చిన వారికే అభివృద్ధిలో సహకరిస్తామని హామీ ఇస్తున్నారు. స్వతంత్రంగా గెలిచే వారిపైనా.. ఏకగ్రీవం అయిన వారిపైనా నాయకులు ఫోకస్ పెడుతున్నారు.



వెల్దండ మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థికి బీజేపీ ప్రచారం

బాల్యానికి 'బంధం' వద్దు

- బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యేక కమిటీలతో అవగాహన సదస్సులు
- ప్రతీ గ్రామంలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ ఏర్పాటు
- మండల కేంద్రాలు, గ్రామాల్లో అవగాహన సదస్సులు



బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక కమిటీ సభ్యులు (ఫైల్)

వనపర్తి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బాల్యానికి 'మూడు ముళ్ల బంధం' వద్దనే లక్ష్యంతో ప్రభుత్వం బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడో ఒక చోట బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. అందుకు తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత, అవగాహనా లోపాలు ప్రధాన కారణమని చెప్పొచ్చు. మరికొందరు అభద్రతాభావంతో బాలికలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తున్నారు. దీంతో వారి విద్యాభ్యాసం నిలుచిపోతోంది. సరైన వయసు రాకముందే గర్భం దాల్చితే బాలిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది.

నిరంతర ప్రయత్నం

వనపర్తిని బాల్య వివాహాల రహిత జిల్లాగా మార్చే దిశగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అధికారులు నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహిస్తూనే ఉన్నారు. జిల్లాస్థాయిలో కలెక్టర్, డివిజన్ స్థాయిలో ఆర్డీవో లేదా అదనపు కలెక్టర్, ప్రాజెక్టు స్థాయిలో సీడీపీవో, మండల స్థాయిలో తహసీల్దార్, సెక్టార్ స్థాయిలో సూపర్‌వైజర్ వీటిని పర్యవేక్షిస్తున్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఓలతో పాటు మరో 15 మంది సభ్యులుగా చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ మోడల్ స్కూళ్లలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థుల్లో ఎంత మంది ఉన్నత చదువులకు వెళ్తున్నారు. ఎంత మంది చదువును నిలిపివేస్తున్నారు అనే విషయాలను చర్చిస్తున్నారు. చదువును మధ్యలో ఆపేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సమస్యను తెలుసుకుంటున్నారు. పిల్లలను తిరిగి బడికి పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామీణ స్థాయిలో ఎదురయ్యే సమస్యలను మండల స్థాయి కమిటీల్లో చర్చించి బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

గ్రామస్థాయి కమిటీలదే ప్రత్యేక పాత్ర

వనపర్తి జిల్లాలోని 15 మండలాల్లో 268 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ కమిటీలు బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తున్నాయి. ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం వస్తే, వెంటనే అక్కడికి వెళ్లి అడ్డుకుంటున్నారు. సదరు కుటుంబ సభ్యులు అంగీకరించకపోతే కేసులు నమోదు చేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 41 బాల్య వివాహాలను అడ్డుకొని, బాధ్యులపై కేసులు నమోదు చేశారు.

అవగాహనతోనే అడ్డుకట్ట



బాల్య వివాహాలను నిర్మూలించడానికి గ్రామీణ, మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు వేశాం. గ్రామీణ స్థాయిలో ప్రతీ మంగళవారం, మండల స్థాయిలో ప్రతీ బుధవారం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. మీ ప్రాంతంలో ఎక్కడైనా బాల్య వివాహం చేసేందుకు యత్నిస్తున్నా, చేస్తున్నట్లు తెలిసినా చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు లేదా పోలీసు హెల్ప్‌లైన్ 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

- రాంబాబు, జిల్లా బాలలసంరక్షణ అధికారి

మద్యం పట్టివేత

కోయిలకొండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపూర్ చౌరస్తా వద్ద ఆదివారం రూ. 7వేల విలువ గల రూ6.48 లీటర్ల లిక్కర్‌ను ఎఫ్ఎస్‌టీ ఫ్లయింగ్ టీం పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు. మండలంలోని చన్‌మన్‌పల్లి గ్రామానికి చెందిన మైబయ్య లిక్కర్‌ను తరలిస్తుండగా ఎఫ్ఎస్‌టీ బృందం సీజ్ చేసి, మైబయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఏదుట్లలో 11.7 లీటర్ల మద్యం పట్టివేత

గోపాల్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ బెల్టుషాప్‌లో మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమెదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ కుమార్ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఏదుట్లలో ఆదివారం ఓ బెల్టుషాప్‌లో మద్యం అమ్ముతున్న సమచారంతో పోలీస్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించగా.. 11.7 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమెదు చేశామన్నారు. వాటి ధర రూ.6 వేలు ఉంటుందన్నారు. బెల్టు షాప్‌లో మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉండవల్లిలో 8.6 లీటర్లు..

ఉండవల్లి, (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద బైక్‌పై మద్యం అక్ర మంగా రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం రావడంతో పోలీసులు తనిఖీ చేశారు. ఆదివారం సాయంత్రం తనిఖీలో మొ త్తం 8.6 లీటర్ల మద్యం లభించింది. దీని విలువ సుమారు రూ. 9,504లుగా అంచనా వేశామని పోలీసులు తెలిపారు. బైక్‌పై ఉన్న నరేశ్, గోవర్ధన్, బాలును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

చోరీ చేసిన మహిళకు దేహశుద్ధి



దొంగతనం చేసిన మహిళకు దేహశుద్ధి చేస్తున్న ప్రజలు

అమరచింత, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సొంత ఊరికి వెళ్లడానికి బస్సు కోసం వేచి ఉన్న ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి బంగారు, వెండి ఆభరణాలను దోచుకునే ప్రయత్నించిన ఓ మహిళకు ప్రయాణికులు, చుట్టుపక్కల వారు దేహశుద్ధి చేసిన ఘటన వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కురువ పెద్ద బాలమ్మ వృద్ధురాలు పని నిమిత్తం అమరచింతకు వచ్చి గ్రామానికి వెళ్లడానికి రాజీవ్ గాంధీ చౌరస్తాలో అలీ బాబా దుకాణం సమీపంలో బస్సు కోసం వేచి ఉంది. ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని గమనించిన నారాయణపేట జిల్లా నర్వ మండలానికి చెందిన ఓ మహిళ, వృద్ధురాలి వద్ద ఉన్న బ్యాగ్‌ను చప్పుడు కాకుండా తీసుకుని పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో వేసింది. ఆమె తీసుకువెళ్లిన బ్యాగులో డబ్బులు లేకపోవడంతో అక్కడే పారేసి మళ్లీ వృద్ధురాలి దగ్గరకు వచ్చి కూర్చుంది. వృద్ధురాలి వద్ద ఉన్న కవర్ కనబడకపోవడంతో ఆ మహిళను అడుగగా ఎవరో వ్యక్తి ఆ బ్యాగ్‌ను కంపలో తీసుకెళ్లి వేశాడని నమ్మబలికి వృద్ధురాలిని ముళ్లపొదల్లోకి తీసుకెళ్లింది.

అక్కడ పొదల్లో వృద్ధురాలిని బాగా కొట్టి ఆమె చేతికున్న ఐదు వెండి కడియాలు, మెడలోని 18 బంగారు గొలుసును బలవంతంగా దోచుకుని వృద్ధురాలిని తీవ్రంగా కొట్టింది. దీంతో ఆ మహిళ నుంచి తప్పించుకున్న వృద్ధురాలు కేకలు పెడుతూ పరుగెత్తింది. గమనించిన చుట్టుపక్కల వారు వృద్ధురాలి అరచేతులకు, ముఖానికి దెబ్బలు గమనించి ఆమె ఒంటిపై మట్టి బురద తగలడం గమనించి ఆరా తీశారు. సదరు మహిళను గుర్తించి ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులు అప్పగించారు. వృద్ధురాలికి సంబంధించిన కడియాలు, బంగారు టిక్కీలు అప్పగించారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కకాటుతో 18 మందికి గాయాలు

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి నియోజక వర్గంలో ఆదివారం కుక్కల స్వైర విహారం చేయడంతో 18మంది గాయపడ్డారు. వివిధ ప్రాంతాల్లో కుక్క కాటుకు గురై కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఇందుకు సంబంధించిన వివరాలు స్థానికుల కథనం ప్రకారం.. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని తాండ్రాలో ఒకరికి, వెల్దండలో ఒకరు, ఉప్పగండ్లలో ఒకరు, ఎర్రవల్లిలో ఒకరు, తర్నికల్‌లో ముగ్గురు, దుబ్బతండాలో ఒకరు, కల్వకుర్తి పట్టణంలో ఇద్దరినీ కుక్కలు కరిచాయి. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన ఇద్దరికీ, కర్నూల్‌కు చెందిన ఒకరికి కుక్కలు కాటు వేశాయి. పట్టణంలోని పలు కాలనీలలో కుక్కలు దాడి చేయడంతో పట్టణానికి చెందిన ఆరాహి, అన్విత్, వెంకటేశ్, గీత, అంజి, కుప్పగండ్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య, దుబ్బతండాకు చెందిన ప్రీతి, వెల్దండకు చెందిన వీనేష్, తర్నిక ల్‌కు చెందిన వాహీద్, మల్లయ్య, పీకిలి బాలయ్య, ఎర్రవెల్లికి చెందిన అవిష్, వేపూరుకు చెందిన కృష్ణయ్య, రంగాపూర్‌తండాకు చెందిన గణేష్, గౌరీపల్లితండాకు చెందిన వాసు, పెంట్యానాయక్ తండాకు చెందిన రాములు, చెదురుపల్లి తండాకు చెందిన కృష్ణయ్య గాయపడ్డారు. ఆమనగల్లులో ఐదుగురికి కుక్కలు కాటు వేశాయి. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఒకే రోజు కుక్కకాటుకు గురై 18మంది ఆసుపత్రికి వచ్చారని, వారందరికీ యాంటీ రేబిస్ ఇంజక్షన్ ఇచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం తెలిపారు.

పంచాయతీ బరిలో తోటి కోడళ్లు


నెల్లి పద్మ కాంగ్రెస్ అభ్యర్థి


నెల్లి స్వర్ణ బీఆర్ఎస్ అభ్యర్థి

చిన్నచింతకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామ పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. గ్రామంలోని తోటి కోడళ్ల ఇరువురు సర్పంచ్ పదవి కోసం పోటీ పడటంతో ఎంతో ఆసక్తి నెలకొంది. కాంగ్రెస్ నుంచి నెల్లి పద్మ, బీఆర్ఎస్ నుంచి నెల్లి స్వర్ణ సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. కాగా గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

అమరగిరిలో అక్కా, తమ్ముడు పోటీ

» అక్క కాంగ్రెస్, తమ్ముడు రెబల్

» కుటుంబంలో పంచాయతీ ఎన్నికల కుంపటి


పురసాల పెద్ద లింగమ్మ


నిమ్మల నాగన్న

కొల్లాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమరగిరి గ్రామంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో అక్క, తమ్ముడు ఎన్నికల బరిలో పోటీ చేయనున్నారు. కొల్లాపూర్ మండల పరిధిలోని అతి చిన్న గ్రామ పంచాయతీ అయిన అమరగిరి గ్రామంలో జనాభా మొత్తం 344 మంది జనాభా ఉండగా 276 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 100 మంది ఆదివాసీల ఓటర్లే ఉన్నారు. మొదటిసారి ఆదివాసీలకు అవకాశం రావడంతో గ్రామంలో ఉన్న పురసాల పెద్ద లింగమ్మ అంకాలమ్మ కోట ఆలయం పూజారి అయిన ఈమె కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ బరిలో పోటీలో ఉన్నారు. ఈమె సొంత తమ్ముడు నిమ్మల నాగన్న మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ అయినా పార్టీ మద్దతు దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నాడు. ఇద్దరు కాంగ్రెస్ పార్టీతోనే సర్పంచ్ ఎన్నికల్లో బరిలో ఉండనున్నారు. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకున్నాడు. పంచాయతీ ఎన్నికల్లో అక్క, తమ్ముడిలో విజేతలు ఎవరో వేచి చూడాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా పంచాయతీ ఎన్నికలు కుటుంబాల్లో కుంపటి పెట్టాయని గ్రామంలో చర్చ కొనసాగుతోంది. మరోవైపు కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో అన్నాదమ్ములు కొమ్ము గోపాల్, కొమ్ము రాజు, ఎన్నికల బరిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్నారు.

వార్డులన్నీ ఏకగ్రీవం.. సర్పంచ్ పదవికి మాత్రమే పోటీ

కొత్తకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామనంతపూర్ గ్రామంలో రాజకీయ నాటకీయ పరిణమాలు చోటు చేసుకున్నాయి. గ్రామంలో 1,123 మంది ఓటర్లు ఉండగా... ఎనిమిది వార్డులుగా విభజించారు. రెండో విడత నామినేషన్ పర్వం ప్రారంభం కావడంతో సర్పంచ్ పదవికి ఆరుగురు, 8 వార్డులకు వార్డుకు ముగ్గురు చొప్పున 24 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఈ దఫా పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా ఎన్నుకుందామని గ్రామ పెద్దలు ప్రతిపాదన చేశారు. ఏకగ్రీవ ఎన్నికతో వచ్చే నిధులతో గ్రామ అభివృద్ధి, సర్పంచ్‌గా ఎన్నికైన అభ్యర్థి దేవాలయాన్ని నిర్మించాలని తీర్మానించారు. ఆ దశగా చర్చలు నిర్వహించి మొదట వార్డు సభ్యుల ఏకగ్రీవం చేశారు. సర్పంచ్‌కు పోటీలో ఉన్న ఆరుగురిలో ఐదుగురు నామినేషన్ వెనక్కి తీసుకోవాలని చర్చలు నిర్వహించారు. నలుగురు పోటీ నుంచి తప్పుకోవడానికి ముందుకు రాగా యాదగిరిరెడ్డి, శివుడు మిగిలారు. శివుడిని తప్పుకోవాలని ఒత్తిడి తీసుకరాగా.. చివరి క్షణంలో ఒప్పుకోవడానికి నో అన్నాడు. దీంతో పోటీ అనివార్యమైంది. నాలుగు రోజులుగా సర్పంచ్ పదవిపై జరిగిన చర్చలు చివరి క్షణంలో తుస్.. అనడంపై అందరు అవాక్కయ్యారు. ఉసే లేని వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో అదృష్టమంటే ఇలాగే ఉంటుందని చర్చించుకుంటున్నారు.

భూ పరిహారం రూ.25 లక్షలు చెల్లిస్తే
పోటీ నుంచి తప్పకుంటాం

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


ఖిల్లాఘణపురం పంచాయతీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని గణప సముద్రం జలాశయంలో భూములు కోల్పోతున్న ముంపు రైతులకు కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.25 లక్షలు భూ పరిహారం చెల్లిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సవాల్ విసిరారు. మండలంలోని గట్టుకాడిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి పంచాయతీ ఎన్నికల ప్రచారం చేశారు. మండల కేంద్రంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో ఎకరాకు రూ.11,75,000 భూ పరిహారం అందిస్తామని తెలిపినట్లు గుర్తు చేశారు. మండల కేంద్రంలో నిరుపేదల కోసం 315 ప్లాట్లు లే అవుట్ వేసి సిద్ధం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్లాట్లను పంపిణీ చేసే శక్తి లేదన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో సంక్షేమ పథకాలు అటకెక్కించారన్నారు.

పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను సర్పంచ్‌లుగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు సకల మర్యాదలు

» తెల్లారక ముందే ఇంటి ముంగిట్లో ప్రత్యక్షం

» కాళ్లబేరాలకూ వెనుకాడని వైనం

» ఓటర్లకు గాలం వేసేందుకు ఎత్తుకు పై ఎత్తులు

నారాయణపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ పోరులో ఉన్న అభ్యర్థులు ఓటర్లకు సకల మర్యాదలు చేస్తున్నారు. మూడు విడతల్లో జరిగే పంచాయతీ పోరులో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. తెల్లారక ముందే ఓటర్ల ఇంటి ముంగిట్లోకి వాలిపోతూ మామ... అత్త... అవ్వ.. అమ్మ... వదిన.. అన్న..బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ మీ ఓటు ద్వారా నన్ను ఆశీర్వదించాలని ప్రాధేయపడ్తు న్నారు. గెలిపిస్తే ఐదేళ్ల పాటు మీకేమి కావాలో నేను చేసి పెడ్తానని భరోసా కల్పిస్తున్నారు. గ్రామాభివృద్ధితో పాటు ఏ చిన్న సమస్యలైనా పరిష్కరిస్తానని ఈ ఒక్కసారికి మీ అందరి ఓట్లు వేసి నన్ను గెలిపించాలని విన్నవిస్తున్నా రు. పలువురు అభ్యర్థులు ఓటర్ల కాళ్లు పట్టుకొని కాళ్ల బేరాలకు సైతం వెను కాడడం లేదు. ఓటు వేసి ఆశీర్వదించాలని కాళ్లకు దండం పెట్టుకుంటున్నారు. పార్టీల ముఖ్యనేతలకు ఫోన్‌లో ఓటర్లతో మాట్లాడిస్తూ తమ మద్దతుదారులను గెలిపించాలని కోరుతున్నారు. తమ మద్దతుదారులను గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ప్రధాన పార్టీల అధినేతలు సైతం ఓటర్లకు అభయం ఇస్తున్నారు. ఓటు బ్యాంకు పెంపొందించుకునేందుకు బరిలో ఉన్న అభ్యర్థులు ఏక్‌దీన్‌ఖా సుల్తాన్ ఐన ఓటరు మహాశయులకు సకల మర్యా దలు చేస్తున్నారు.

ఉప సర్పంచ్ ఎన్నికకు చేతులెత్తే పద్ధతి

మహబూబ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధజ్యోతి) : గ్రామాల్లో వార్డు సభ్యులుగా గెలిచిన వారు చేతులెత్తే పద్ధతిలో ఉపసర్పంచును ఎన్నుకుంటారు. నిర్ణయించిన తేదీన పోలింగ్ ముగిసిన తరువాత, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది. ముందుగా వార్డు సభ్యుల ఓట్లను వార్డుల వారీగా లెక్కిస్తారు. ఆ తరువాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్లను లెక్కిస్తారు. అనంతరం ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. అందుకు ఎలాంటి రిజర్వేషన్లు ఉండవు కాబట్టి, గెలిచిన వార్డు సభ్యులలో ఎవరైనా పోటీ పడవచ్చు. పోటీలో ఉన్న వారి పేర్లను ముందుగా తీసుకుంటారు. వారిని చేతెలెత్తే పద్ధతిన మిగిలిన వార్డు సభ్యుల నుంచి మెజారిటీ మద్దతు వచ్చిన వారిని ఎంపిక చేస్తారు. పది మంది సభ్యులున్న పంచాయతీల్లో పోటీలో ఉన్న ఇద్దరికి చేరో ఐదుగురు సమానంగా చేతులెత్తితే, అప్పుడు సర్పంచ్‌గా గెలిచిన అభ్యర్థి ఓటును పరిగణనలోకి తీసుకుంటారు. ఆయన మద్దతు ఇచ్చిన వారే ఉప సర్పంచ్ అవుతారు. ఏదైనా కారణంతో ఆ రోజు ఉపసర్పంచ్ ఎన్నిక జరగకపోతే మరుసటి రోజు అవకాశం ఇస్తారు.

వరుసగా మూడోసారి అతివలకే...

ఎర్రవల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి గ్రామపంచాయతీ సర్పంచు స్థానాన్ని వరుసగా మూడోసారి మహిళనే అధిష్ఠించనున్నారు. 2019లో జనరల్ మహిళలకు కేటాయించారు. ఇటీవల ప్రకటించిన రిజర్వేషను కూడా జనరల్ మహిళల రిజర్వ్ కావడంతో మళ్లీ మహిళలే బరిలో నిలిచే అవకాశం వచ్చింది. దీనితో గ్రామసర్పంచ్ పీఠంపై మరోసారి మహిళ కూర్చోబోతున్నది. మూడోసారి మహిళలకు రిజర్వేషన్ అనుకూలంగా రావడం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.. కాగా 2013లో ఎస్సీ మహిళకు రిజర్వు అయినప్పటికీ విశ్రాంత ఉపాధ్యాయురాలు మరియమ్మ పోటీ చేసి సర్పంచ్‌గా గెలవడంతో వరుసగా మూడు సార్లు అతివలకే పాలించే అదృష్టం వరించింది.

వలస ఓటర్లపై నాయకుల నజర్

» ప్రతీ ఓటు గెలుపునకు కీలకమే


ఓటర్లతో మాట్లాడుతున్న నాయకులు

అచ్చంపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికలో ప్రతీ ఓటు కీలకం కావడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ముందస్తుగా ఓటర్లను కలిసి తమ ఖాతా లో వేసుకొనేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గ్రామాలలోని ప్రజలు జీవనోపాధి కోసం హైదరాబాద్, మిర్యాలగూడ, ముంబై తదితర పట్టణాలకు వలసవెళ్లారు. ఈ క్రమంలో గ్రామాలలో ఉన్న వారి బంధువుల వద్ద వలసపోయిన కుటుంబాల వారి అడ్రస్సులు, ఫోన్ నెంబర్లను సేకరిస్తున్నారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులు వలస ఓటర్లతో మంతనాలు జరుపుతున్నారు. ఒక్కో పట్టణంలో ఒక్కరికి బాధ్యతలు అప్పగించి మంచి, చెడ్డల కోసం కొంత డబ్బులను ముట్టజెప్పుతున్నట్లు తెలిసింది.



మనదేం లేదు.. అంతా వాళ్లదే

» లోకల్ ఫైట్‌లో యువతే కీ రోల్


కౌకుంట్ల గ్రామంలో సర్పంచ్ ఎన్నికలపై చర్చించుకుంటున్న గ్రామ పెద్దలు

మహబూబ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు సర్పంచ్ ఎన్నికలనగానే పోటీచేసే వాళ్లు పెద్దమనుషులను సంప్రదించే వాళ్లు. వాళ్లకు ఏ పార్టీలు ఉండేవి కావు... కులానికి ఒకరో ఇద్దరో పెద్ద మనుషులు ఉండేవాళ్లు. వాళ్లను కలిసి మద్దతు కోరితే పోటీలో ఉన్న వాళ్లలో ఎవరైతే ఊరికి బాగుంటుందోనని ఆలోచన చేసి తమ కులస్థులకు ఫలానా అభ్యర్థికి మద్దతు ఇద్దామంటే వాళ్ల మాటకు కట్టుబడి అంతా ఓటేసేవాళ్లు. ఇప్పుడు కాలం మారిపోయింది. ఎన్నికలు రాగానే ముందు పార్టీ టికెట్ కోసం పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటున్నారు. పెద్ద మనుషుల మాటకు క్రమంగా కాలం చెల్లుతోంది.. యువతనే ఎన్నికలను శాసిస్తోంది. పెద్దమనుషులు కూడా మనదేం లేదు అంతా వాళ్లదే అన్నట్లుగా చాలావరకు చురుగ్గా ఎన్నికలలో పాలు పంచుకోవడం లేదు. పిల్లలు చూసుకుంటారులే అన్నట్లుగా యువతనే ఎక్కువగా సందడి చేస్తోంది. పోటీలో నిలడబే వాళ్లలో 70 శాతం మంది యువతనే ఉంటున్నారు.

ఏకగ్రీవం కోసం నాయకుల పాట్లు

» మూడోవిడత ఉపసంహరణపై నేతల దృష్టి

మహబూబ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను పోటీ నుంచి తప్పించి ఏకగ్రీవం చేసుకునేందుకు నాయకులు పడుతున్న పాట్లు అన్ని ఇన్ని కావు. ముందుగా అసలు పోటీగా నామినేషన్ వేయకుండా ప్రయత్నాలు చేస్తారు. ఆ సమయంలో వారి మాట వినకుండా నామినేషన్ వేసిన వారిని ఎలాగైనా పోటీ నుంచి ఉపసంహరణ చేయించేందుకు చివరి ప్రయత్నంగా ఫలానా వ్యక్తి చెబితే అతని మాట విని పోటీ నుంచి తప్పుకుంటాడనుకునే వారి ద్వారా ప్రయత్నాలు చేస్తారు. ఈనెల 9న చివరి విడత ఉపసంహరణ ఉండటంతో అలాంటి వారిని రంగంలో దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులకు పోటీ చేసిన వారిని కూడా పోటీ నుంచి తప్పించి తమ మద్దతు దారులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. గ్రామంలో ప్రతీ ఒక్కరికీ ఎవరో ఒకరు ఆప్తులు, స్నేహితులు, బంధువులు లేదా అవసరానికి ఉపయోగపడిన వారు, ఆర్థిక అవసరాలు తీర్చిన అలాంటి వారితో పోటీలో ఉన్న వారిని ఒప్పించి విత్‌డ్రా చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్దండ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాఘాయిపల్లి సమీపంలో హైదరాబాద్ - శ్రీశైలం ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమనగల్లు మండలం చంద్రాయన్‌పల్లి తండాకు చెందిన గటావత్ ఛత్రపతి(21) అనే యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... కల్వకుర్తి నుంచి ఆమనగల్లు వైపునకు ద్విచక్రవాహనంపై ఛత్రపతి అతని స్నేహితులు ఆమనగల్లుకు చెందిన ఆరిఫ్, సమీర్ వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఛత్రపతితో పాటు, ఆరిఫ్, సమీర్‌లు గాయపడ్డారు. గాయపడ్డ వీరిని చికిత్సనిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా ఛత్రపతి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుని తండ్రి బాల్యా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఆల్వాన్‌పల్లి గ్రామంలో వాడ్యాల బాలయ్య (50) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వాడ్యాల బాలయ్య కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పాటు ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో మనస్థాపానికి గురై ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి

గండీడ్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రాజెక్ట్‌లో పడి మృతి చెందిన ఘటన రుసుంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రుసుంపల్లి అనుబంధ గ్రామామైన వడ్డెగుడిసెలకు చెందిన రాములు (40) రెండు రోజుల క్రితం చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలో గల సాలార్‌నగర్ ప్రాజెక్టుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడని తెలిపారు. ఆదివారం సమీప పొలం రైతులు గమనించిగా విషయం తెలిసింది. ఈ విషయమై తమకు ఫిర్యాదు రాలేదని మహమ్మదాబాద్ ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఉరి వేసుకొని వివాహిత బలవన్మరణం


స్రవంతి (ఫైల్)

కల్వకుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కల్వకుర్తి పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ జి.మాధవరెడ్డి కథనం ప్రకారం.. వంగూరు మండలం డిండిచింతపల్లికి చెందిన ప్రవీణ్, అతని భార్య స్రవంతిలు కల్వకుర్తి పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. పట్టణంలో కళాంజలి లేడీస్ టైలర్ షాపును నిర్వహిస్తూ ప్రవీణ్ అతని భార్య స్రవంతిలు జీవనం కొనసాగిస్తున్నారు. భార్యాభర్తల గొడవల వల్ల స్రవంతి(37) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు చూసేవరకే అప్పటికే మృత్యువాత పడింది. విషయం తెలుసు కున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

కబడ్డీ చాంపియన్ వనపర్తి

» రన్నర్‌గా హైదరాబాద్

» మూడో స్థానంలో నిలిచిన నారాయణపేట-హన్మకొండ


మూడోస్థానంలో నిలిచిన నారాయణపేట


రన్నర్ హైదరాబాద్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ టోర్నీ చాంపియన్‌గా వనపర్తి జట్టు నిలిచింది. ఆదివారం ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్ వనపర్తి-హైదరాబాద్ జట్ల మధ్య హోరాహోరీగా జరిగింది. వనపర్తి జట్టు హైదరాబాద్‌పై 40-38 పాయింట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్‌గా వనపర్తి జట్టు నిలువగా, హైదరాబాద్ జట్టు రన్నర్‌గా నిలిచింది. నారాయణపేట-హన్మకొండ జట్లు మూడో స్థానంలో నిలిచాయి. మహబూబ్‌నగర్ జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలుర కబడ్డీ టోర్నీ ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర కబడ్డీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, మాట్లాడారు. ప్రోకబడ్డీ మాదిరగా, తెలంగాణ ప్రీమియర్ లీగ్ త్వరలో నిర్వహించేందు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు క్రమశిక్షణ తప్పని సరి అని, కబడ్డీ క్రీడ క్రమశిక్షణకు మారు పేరు అన్నారు. కార్యక్రమం లో ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేష్, జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ కె.ఎస్.రవికుమార్, శ్రీరామ, జయరామ ఇండస్ట్రీస్ అధినేత బెక్కరి రామిరెడ్డి, రాష్ట్ర కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి మద్ది మహేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, వనపర్తి కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ పద్మజా రెడ్డి, ప్రముఖ కబడ్డీ వాఖ్యత మల్లేష్, బాస్కెట్ బాల్ జిల్లా అధ్యక్షుడు జాకీర్, కబడ్డీ అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రాములు, చెన్నవీర య్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, ముత్యం రాంచంద్ర య్య, నర్సింహులు, చెన్నవీరయ్య, బాల్‌రాజ్, పాపరాయుడు, శ్రీనివాస్, గణేష్, బాల్‌రాజ్, నగేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి విలువిద్య పోటీలకు రవి


జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారుడు రమావత్‌రవి, కోచ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఈ నెల 10 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి విలువిద్య పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన అర్చరీ క్రీడాకారుడు రమావత్ రవి ఎంపికైనట్లు కోచ్ జ్ఞానేశ్వర్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ అర్చరీ చాంపియన్ షిప్ టోర్నీలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైయ్యాడు. దీంతో జిల్లా అర్చరీ సంఘం ప్రధాన కార్యదర్శి రాంచందర్ క్రీడాకారుడు రమావత్ రవి, కోచ్ జ్ఞానేశ్వర్‌లను అభినందించారు.

దశాబ్దాల కల సాకారం దిశగా అడుగులు

» నిలువు రాళ్లు, దత్తక్షేత్రం మధ్య తగ్గనున్న దూరం


చిట్యాల వాగుపై బ్రిడ్జి నిర్మాణ స్థలం

మక్తల్‌రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో ని చిట్యాల గ్రామం మాగనూరు మండలంలో ని కఠ్రందొడ్డి గ్రామాల మధ్యలో ఉన్న వాగు పై బ్రిడ్జిని నిర్మిస్తున్నందున ఆ ప్రాంత వాసు ల దశాబ్దాల కల సహకారం దిశగా అడుగు లు పడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని ప్రతిపాదనను సంబంధిత మంత్రి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వాగుపై బ్రిడ్జిని నిర్మించడంలో భాగంగా ఇటీవల సర్వే పనులు చేపట్టారు. ప్రతీ ఏటా వర్షాకాల సమయంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించాలంటే చుట్టూ 30 నుంచి 40 కి.మీ అదనంగా ప్రయాణించాల్సిందని ఇది అదనం భారంగా మారిందని వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా రెండు మండలాల ప్రజలు కోరుతున్నారు. బ్రిడ్జి నిర్మిస్తే ఇటు చిట్యాల, పసుపుల నుంచి అటు ముడుమాల్, గూడెబల్లూరు వె ళ్లే వారికి దూరం తగ్గి సమయం ఆదా అవుతుందని, బ్రిడ్జిని వెంటనే నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆదా కానున్న సమయం

చిట్యాల వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే ఇటు ముడుమాల్ నిలువురాళ్ల నుంచి పసుపుల దత్త క్షేత్రానికి కేవలం 15 కి.మీ దూరంతో 15 నిమిషాల్లో చేరుకునే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. ప్రస్తుతం ముడుమాల్ నిలువురాళ్ల నుంచి మక్తల్ మీదుగా పసుపులకు చేరుకోవాలంటే ఇంచుమించు 50 కిలోమీటర్ల ప్రయాణం చేసి దాదాపు గంట సమయం ప్రయాణం చేయాల్సి వస్తుంది. వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే దూరం తగ్గడంతో పాటు సమయం ఆదా అవుతుంది. పర్యాటకపరంగా కూడా చిట్యాల వాగుపై బ్రిడ్జి ఎంతో ప్రాధాన్యత ఉందని ఆ దిశగా అధికారులు దృష్టి సారించి వీలైనంత త్వరగా నిర్మాణం పూర్తి చే

బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలి



వాగుపై బ్రిడ్జి లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాం. వర్షాకాలంలో చుట్టూ తిరిగి రావా లంటే చాలా దూరం ప్రయాణం చేయా ల్సి వస్తుంది. వీలైనంత త్వరగా బ్రిడ్జిని ని ర్మించాలి.
- రాజు చిట్యాల

న్యూస్ బాక్స్

ఆర్థిక సాయం అందజేత

పెద్దమందడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితునికి స్నేహితులు కలిసి ఆర్థిక సాయం చేశారు. మండల పరిధిలోని చిన్నమందడి గ్రామానికి చెందిన 1999-2000 ఎస్ఎస్సీ బ్యాచ్‌కి చెందిన వీర భద్రయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న స్నేహితులు రూ.35,000 జమ చేసి అందజేశారు.

ఖిల్లాఘణపురంలో పోలీసుల కవాతు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మామిడిమాడ, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో ఆదివారం ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. గ్రామాల్లో శాంతియుత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో నిబంధనలను అతిక్రమించే అసాంఘిక శక్తుల పై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'తయారీ రంగానికి మద్దతు'

వనపర్తి రాజీవ్‌చౌరస్తా ,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ట్రేడింగ్ తయారీ రంగానికి ఎస్‌బీఐ ఎల్లప్పుడు మద్దతుగా నిలుస్తు వస్తుందని రీజనల్ మేనేజర్ సునీత తెలిపారు. భవిష్యత్తులో కూడా ఎస్‌బీఐ మద్దతు అదే విధంగా కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌బీఐ వనపర్తి శాఖల సిబ్బంది స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ కనెక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా పట్టణంలోని వ్యాపారస్తులను కలిశారు. సూక్ష్మ చిన్న, వ్యాపార సంస్థల ఆర్థిక అవసరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ సునీత మాట్లాడుతూ... జీఎస్టీ, ఐటీ రిటర్న్ సక్రమంగా దాఖలు చేసే వ్యాపారస్తులు వారికి లభించే రుణ పరిమితిని అరగంటలో తెలుసుకునేలా ఎస్‌బీఐ చర్యలు తీసుకున్నదని అన్నారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ మెయిన్ బ్రాంచ్ రవీంద్ర కుమార్, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'నిందలతో గెలుపును ఆపలేరు'

గోపాల్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీపై నిందలతో విజయాన్ని కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరని మండల ఇన్‌చార్జి సత్యశీలారెడ్డి, అభ్యర్థి సువర్ణ, మండల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తప్పుడు నామినేషన్‌తో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి స్వప్న పోటీలో నిలుచున్నరని, వాస్తవని వారి నామినేషన్ చెల్లదని, ఈ విషయాన్ని ఎన్నికల అథారిటీ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, తన భర్తను తనను వేదిస్తూ.. తప్పుడు ప్రచారంపై కోర్టుకు కూడా వెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో శివన్న, ఆంజనేయులు, వెంకటేష్, శేఖర్, సంజీవ్, శ్రీశైలం, నాగరాజు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

వీపనగండ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు తిరుపతయ్య ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి అరుణ్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామాభివృద్ధిని ఆకాంక్షించి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తిరుపతయ్య తెలిపారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని జూపల్లి అరుణ్ కార్యకర్తలకు తెలిపారు. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

పెద్దమందడి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అధికార పార్టీ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో మరింత అభివృద్ధి చేయవచ్చని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. మొదటి విడతలో జరగనున్న సర్పంచు ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరఫున జగత్‌పల్లి, మణిగిళ్ల, పెద్దమందడి, మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి, అల్వాల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో ఇందిరమ్మ పాలనాలో అందరికి మరింత సంక్షేమ పథకాలు అందించవచ్చన్నారు. గ్రామాలాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కొత్తకాపు రామకృష్ణారెడ్డి, రఘుప్రసాద్, వెంకటస్వామి, ఐ.సత్యారెడ్డి పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకులను ఎన్నుకోవాలి

- వార్డు సభ్యులదే కీలకపాత్ర

- వీఐపీ డైరెక్టర్ నాగేంద్ర స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ నాగేంద్ర స్వామి

ఆత్మకూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో నిస్వార్థ నాయకులను ఎన్నుకుంటే గ్రామాలను అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందని వీఐపీ రాష్ట్ర డైరెక్టర్ నాగేంద్ర స్వామి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. భారత రాజ్యాంగ అధికరణ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పార్టీల ప్రమేయం లేకుండా గ్రామాభివృద్ధి కోసం పరితపించే నాయకులను ఎన్నుకోవాలని ఆదేశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా పార్టీలు రాజకీయాలను గ్రామాల్లోకి ప్రవేశ పెడుతూ ప్రజా పాలన పార్టీలపరం చేస్తున్నాయని ఆరోపించారు. పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యులదే కీలకపాత్ర అని ప్రతీ గ్రామంలో వార్డు సభ్యులు ప్రతీ కుటుంబంలోని సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీలో ప్రశ్నించే అవకాశం ఉంటుంది. వార్డు సభ్యులు నిస్వార్థంగా ఉంటూ గ్రామాల ప్రజలకు సురక్షిత పాలన అందించాలని తెలిపారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను నిస్వార్థంగా గ్రామాల ప్రజలకు అందజేసే విధంగా వార్డు సభ్యుల పాత్ర ఉండాలని సూచించారు. పంచాయతీ ఎన్నికల అనంతరం వార్డు సభ్యులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ బాలయ్య, వీఐపీ జిల్లా కోఆర్డినేటర్లు వెంకట్రామిరెడ్డి, శ్రీధర్, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతోనే కుటుంబ వ్యవస్థ మెరుగు



భగవద్గీత పోటీల్లో బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో నిర్వాహకులు శ్రీనివాస్ చౌదరి

కొత్తకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రోజురోజుకు పతనమవుతున్న కుటుంబ వ్యవస్థ, ఆధ్యాత్మిక చింతనను మెరుగు పర్చుకోవాలంటే ప్రతీ ఒక్కరు భగవద్గీతను పఠనం చేయాలని మానవతా విశ్వ విద్యాలయం నిర్వాహకులు శ్రీనివాస్ చౌదరి అన్నారు. మండలంలోని నాటవెల్లి గ్రామ శివారులోని మానవతా విశ్వ విద్యాలయంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పెరుగుతున్నట్లుగా మానవ విలువలు పెరగడం లేదన్నారు. భగవద్గీత పోటీల్లో లీడర్స్ స్కూల్ విద్యార్థి శివ, కేపీఎస్ విద్యార్థి స్నికిత్‌శ్రీల ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. అలాగే కేపీఎస్ విద్యార్థులు సిత్యశ్రీ, చిద్విలసి, మేఘన మానవతా విశ్వ విద్యాలయం విద్యార్థి రాంశంకర్ తృతీయ బహుమతులు గెలుపొందారు. మరో ఎనిమిది మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థుల మంతనాలు

పెబ్బేరు రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన అధికార పార్టీకి చెందిన సర్పంచ్ అభ్యర్థులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. అదే విధంగా ఆయా గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన సర్పంచు స్థానాలకు వివిధ గ్రామాల్లో ముగ్గురు నలుగురు సర్పంచి స్థానంలో పోటి చేయడంతో ఎవరిని పోటీలో నిలబెట్టాలనో ఎవరిని విత్‌డ్రా చేయాలనో మండలంలో మంతనాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో మేము సీనియర్, మీరు జూనియర్ అంటున్న సర్పంచు స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థులు భీష్మించుకుంటున్నారు. మంతనాలు జరిపి రాజీ చేకూర్చాలని స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి, మండల పార్టీ సీనియర్లకు అప్పజెప్పినట్లు సమాచారం.

ఏకగ్రీవమైన రామమ్మపేట : సన్మానించిన ఎమ్మెల్యే



సర్పంచు పద్మమ్మను, వార్డు మెంబర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మెఘారెడ్డి

పెబ్బేరు రూరల్ డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రామమ్మపేట గ్రామ సర్పంచు ఏకగ్రీవమైంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పద్మమ్మ చెన్‌రాయుడు సర్పంచ్‌గా ఏకగ్రీమయ్యాడు. ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఏకగ్రీవ సర్పంచి పద్మమ్మను శాలువాతో సన్మానించి అభినందించి, ఎమ్మెల్యే మాట్లాడారు. రామమ్మపేట గ్రామం ఏకగ్రీవమైనందున తన నిధుల నుంచి రూ.20 లక్షలు ఇస్తానని సర్పంచు పద్మమ్మకు హామీ ఇచ్చారు. రామమ్మపేట నూతనంగా ఏకగ్రీవమై వార్డు మెంబర్లు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డి, మధు, నాగేంద్రం, నారాయణరెడ్డి, లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

అమరచింత : మండల పరిధిలోని చింతరెడ్డిపల్లి, నాగల్‌కడుమూర్ గ్రామాల సర్పంచులుగా రామేశ్వరమ్మ, శివ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆదివారం అధికారులు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు చింతరెడ్డిపల్లి సర్పంచ్ రామేశ్వరమ్మ, ఉప సర్పంచ్ అనూషతో పాటు వార్డు సభ్యులు నాగల్‌కడుమూర్ సర్పంచ్‌గా శివ కుమార్ ఉప సర్పంచ్ మొగిలన్న, వార్డు సభ్యులు ఏకగ్రీవం కావడంతో ఎన్నికల అధికారి సునీల్, శేఖర్ రెడ్డిలు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతరెడ్డిపల్లి, నాగల్‌కడుమూర్ గ్రామ ప్రజలు కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులను అభినందించారు.

భీమా కాల్వకు వీడని గ్రహణం

- ముళ్ల పొదలతో ముందుకు సాగని సాగునీరు - ఆందోళనలో అన్నదాతలు

అమరచింత, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతలకు సాగునీరు అందించే భీమా కాలువలో అడుగడుగునా జమ్ము ముళ్లపొదలు పేరుకుపోయి ముందుకు సాగునీరు పారక గ్రహణంగా మారుతూ వస్తుంది. 9 ఏళ్ల క్రితం భూత్పూరు రిజర్వాయర్ కింద మక్తల్, నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాల్లోని ఆయా గ్రామాలను అనుసంధానం చేస్తు 32 కిలో మీటర్లకు పైగా బీమా కాలువ ద్వారా చెరువులు నింపడం, పిల్లకాలువ ద్వారా సాగునీరు సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ కాలువను నిర్మించారు.

లక్ష్యాన్ని చేరని సాగునీటి సరఫరా

భీమా కాలువ ద్వారా 25వేల ఎకరాలకు సాగునీటిని అందించి అమరచింత, నర్వ ఆత్మకూరు, మక్తల్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో గల పంట పొలాల్లో పిల్ల కాలువలు నిర్మించారు. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఆయా ప్రాంతాల్లో ఉన్న కాలువలకు లైనింగ్ పనులు సైతం అధికారులు పూర్తి చేశారు. సాగునీటి సరఫరా మొదట్లో ప్రయోగవంతంగా కొనసాగిన కొన్నాళ్ల తరువాత ఆయా ప్రాంతాల్లోని కాలువలో జమ్ము, పిచ్చి మొక్కలు పూడిక పెరగడం వల్ల కేవలం 10 నుంచి 15000 ఎకరాలకు మాత్రమే చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతుంది. జమ్ము పిచ్చి మొక్కల కారణంగా సాగునీటి సరఫరా సామర్థ్యం అనుకున్న లక్ష్యానికి చేరలేకపోతుందని చెప్పవచ్చు.

పూడిక పనులు చేసినప్పటికీ

లక్ష రూపాయలు ఖర్చు పెట్టి బీమా కాలువలో అమరచింతకు చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది పూడిక పనులు చేపించిన , మరికొంత ఈజీఎస్ ద్వారా పూడిక పనులు చేపట్టినప్పటికీ భూత్పూర్ రిజర్వాయర్ నుంచి చివరి ఆయకట్టు వరకు అధికారుల పర్యవేక్షణ లోపంతో తరచైె పిచ్చి మొక్కలు జమ్ము వ్యర్థ పదార్థాలు కాలువలో పడి సాగునీరు ముందుకు వెళ్లడం లేదని చెప్పవచ్చు ముఖ్యంగా నాగల్‌కడుమూర్, పామిరెడ్డిపల్లి గ్రామాల మధ్య కాలువ లోతుగా ఉండడం వల్ల పూడికతీత పనులు అరకొరగా చేయడంతో అక్కడ కాలువలో చిన్న చిన్న చెట్లు జమ్ము మొక్కలు పెరగడంతో సాగునీరు ముందుకు వెళ్లడం లేదు. దీంతో సాగునీరు చివరి ఆయకట్టు వరకు వెళ్లక బీమా కాలువకు గ్రహణం వేయడం లేదని పలువురు రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భూత్పూర్ రిజర్వాయర్ కాలువలో జమ్ము ఇలా..

జమ్ము కారణంగా నీళ్లు పారడం లేదు



బీమా కాలువలో విపరీతమైన జమ్ము, కంప, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం ఉండడం కారణంగా సాగునీరు ముందుకు పారడం లేదు. అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన తూతూ మంత్రంగా కాలువలో సిల్ట్‌ను తొలగిస్తున్నారు. రైతుల బాధలను గుర్తించి బీమా కాలువలో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలి.

- రాము, రైతు పామిరెడ్డిపల్లి అమరచింత మండలం

సిల్ట్‌ను తొలగించాలి



రైతు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భూత్పూర్ రిజర్వాయర్ కాలువలో 0.1 నుంచి చివరి ఆయకట్టు వరకు ఉన్న కాలువలో సిల్ట్ జమ్ము పిచ్చి మొక్కలు తొలగించాలి. వేసవిలో నామమాత్రంగా కాలువలో జమ్మును తొలగించడం కాకుండా శాశ్వత పరిష్కారం జరిగే విధంగా కాలువ అడుగు బాగానే కూరుకుపోయినా సిల్ట్‌ను తొలగించినప్పుడే సాగునీరు చివరి వరకు అందుతుంది.

- బి.వెంకటేష్, తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గట్టుకాడిపల్లిలో వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడిన భక్తులు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గట్టుకాడిపల్లి, అంజనగిరి క్షేత్రంలోని పురాతన దేవాలయం శ్రీలక్ష్మి అలర్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో 7వ తేదీని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామి వారిని అభిషేకించి తులసి, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజారులు భక్తులకు అర్చనలు చేయడంతో భక్తులు భక్తి తన్మయత్వంలో మునిగిపోయారు. 400 సంవత్సరాల క్రితం నేర్పించిన పురాతన అంజనగిరి క్షేత్రం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. ఆలయ ఆవరణలో భక్తులు కోరిన కోర్కెలు తీర్చాలని ముడుపులు కట్టారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో అన్నప్రసాద వితరణ చేసిన కమలొద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన మంజుల, రామేశ్వర్‌రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఖిల్లాఘణపురంలో సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న బాలికలు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బాల బాలికలకు ఆదివారం నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యదర్శి విజయకాంతారావు ఆదేశాల మేరకు ఖిల్లాఘణపురంలో విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల నుంచి వెంకటాంపల్లి గ్రామం వరకు ప్రధాన రహదారిపై బాలికలకు 5 కిలో మీటర్లు, బాలురకు 8 కిలో మీటర్ల వరకు సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. బాలికల విభాగంలో శశిప్రియ, మీనాక్షి, ఇందు, చందన, ప్రవాస్తి, జ్యోతి, సంజన, పూజ, సంగీత, బాలుర విభాగంలో రాము, ఉదయ్, రక్షిత్, యశ్వంత్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీటీలు చిట్టెమ్మ, దేవేందర్, ఏఎన్ఎం వెంకటమ్మ, రజిత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొర్రం కొడుతున్న పట్టించుకోరా?

- తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి

వనపర్తి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కొందరు వ్యక్తులు రాత్రీ పగలు అనే తేడా లేకుండా అక్రమంగా మొర్రం తరలిస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం ఏంటని తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం వనపర్తి మండల పరిధిలోని నాగవరం శివారులోని గుట్టలో సర్వే నెంబర్ 202లో తమకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఐదు సంవత్సరాల కిందట ఎరుకల కులస్తులకు నాగవరం శివారులోని గుట్టలో పందులను మేపేందుకు ఒక ఎకరా పొలాన్ని కేటాయించారని అన్నారు. కుల సంఘం నాయకులు సొంత ఖర్చులతో గుట్టలో ఒక ఎకరా భాగంలో స్థలాన్ని చదును చేస్తే కొందరు దుండగులు అక్రమంగా మట్టి తరలిస్తు గుంతలు గుంతలుగా చేస్తు నాశనం చేస్తున్నారని అన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరు స్పందించడం లేదని అన్నారు. అధికారుల కనుసైగల్లోనే మొర్రం తరలిస్తున్నట్లు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా స్పందించి అక్రమంగా మొర్రం తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేయాలని లేకుంటే కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతామని హెచ్చరించారు. రాముడు, వెంకటయ్య, బాలస్వామి, వెంకటస్వామి, గంగులు, శ్రీను, గోకారి, చిన్నబాలి, లక్ష్మణ్, వెంకటేష్, రాజు, ఎరుకల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో 12 జీపీలకు 228 మంది ఉద్యోగులు

అమరచింత, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా 14వ తేదీన విధులు నిర్వర్తించడానికి అధికారులు సిద్ధమయ్యారు. అమరచింత మండలంలో 14 గ్రామ పంచాయతీలకు గాను ఇది వరకే రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో 12 గ్రామ పంచాయతీలు సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 12 జీపీలు 207 వార్డు స్థానాల జరుగుతున్న ఎన్నికలకు గాను జిల్లాలోని నలుమూలల నుంచి వివిధ శాఖల ఉద్యోగులు ఎన్నికల విధులు నిర్వహించడానికి సంసిద్ధమయ్యారు. తాజాగా ఒక్కొక్కరు ఎంపీడీవో కార్యాలయం కొచ్చి తమ విధుల పత్రాలను సమర్పించి కార్యాలయంలో రిపోర్టు చేసి వెళ్తన్నారు. 12 జీపీలో జరుగుతున్న ఎన్నికల కోసం ఓపీవోలు 105 మంది, పీవోలు 162 మంది, రూట్ అధికారులు ఏడుగురు, జోనల్ అధికారులు ఇద్దరు, స్టేజీ టు అధికారులు 12 మంది, మొత్తం 228 మంది అమరచింత మండలంలో విధులు నిర్వహించడానికి సిద్ధమయ్యారు. ఇందుకు గాను ఆయా జీపీలలో విధులు నిర్వహించే ఉద్యోగులకు రిపోర్టు చేసుకోవడంతో పాటు ఆయా గ్రామాల లోకేషన్ లను అధికారులు చూపించినట్లు తెలిసింది. 13వ తేదీ నుంచి అధికారులు వారి వారికి కేటాయించిన జీపీలకు వెళ్లి విధుల్లో హాజరు అవుతున్నట్లు తెలిపారు.

కరాటే గ్రేడింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కొత్తకోట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో కరాటే గ్రేడింగ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ సాధించారు. ఆదివారం గాడ్స్‌ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ విద్యార్థులకు గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభన కనబరిచిన విద్యార్థుల్లో 15 మందికి ఎల్లో బెల్ట్, ఆరెంజ్ బెల్ట్ 15 మందికి, గ్రీన్ బెల్ట్ 15 మందికి, మెరూన్ బెల్ట్ 9 మందికి, బ్రౌన్ బెల్ట్ ఏడుగురికి అందజేశారు. బెల్ట్‌లు అందుకున్న విద్యార్థులను అకాడమీ చైర్మన్ అబ్దుల్ నబీ, మాస్టర్లు అరవింద్‌చారి, శ్రీకాంత్ యాదవ్, జాఫర్, సాదిక్, హరీష్ యాదవ్, ఇంతియాజ్, శివరాజ్, మహేష్, యోగేశ్వరి, అన్విత, పవన్ అభినందించారు.

గ్రామ అభివృద్ధికి సేవ చేస్తా : దేవరకొండ బాలరాజు



ఉప్పరిపల్లిలో ప్రచారం చేస్తున్న దేవరకొండ బాలరాజు

ఖిల్లాఘణపురం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉప్పరిపల్లి గ్రామాభివృద్ధికి నిజాయితీగా సేవ చేస్తానని దేవరకొండ బాలరాజు తెలిపారు. మండలంలోని ఉప్పరిపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థిగా దేవరకొండ బాలరాజు నిలిచారు. గ్రామంలో నిరంతరం ప్రజలకు సేవ చేస్తూనే అభిమానంతో వివిధ పార్టీల యువకులు చందాలు వేసుకుని అండగా నిలిచి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దింపారని తెలిపారు. గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మార్పు చేయడంతో పాటు సీసీ రోడ్లు, ప్రతి విద్యుత్ స్తంభానికి వీధి లైట్లు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంలో మారుస్తానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల నూతన భవనం నిర్మించి ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఉచిత విద్య అందించే విధంగా కృషి చేస్తానన్నారు. గతంలో గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండి నిస్వార్థంగా సేవ చేసినట్లు గుర్తు చేశారు. మెరుగైన వైద్య సేవల కోసం మినీ ఆసుపత్రి నిర్మించనున్నట్లు తెలిపారు. అరులైన ప్రతి ఒక్కరికి వృద్ధులకు , వితంతువులకు పెన్షన్లు, ఇల్లు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ధాన్యం కొనుగోలులో రైతుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామానికి వచ్చే ఆదాయం వ్యయాలను నిధుల వివరాలు గ్రామ పంచాయతీలో ప్రదర్శించి అందరికీ తెలిసే విధంగా చేస్తామన్నారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా గ్రామ పంచాయతీ ప్రతి రూపాయిని నిబద్ధతతో ఖర్చు చేసి నిజాయితీ పాలన అందిస్తానన్నారు.

ఉద్యమ కవి, గాయకుడు జయరాజ్‌కు సన్మానం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కవి గాయకుడు, రాష్ట్ర కాళోజీ సాహిత్య పురస్కార గ్రహీత జయరాజును ఆదివారం సాహితీ కళా వేదిక సభ్యులు ఘనంగా సన్మానించారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వనపర్తికి వచ్చిన ఆయనను కళావేదిక ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ... జయరాజ్ సమాజాన్ని చైతన్య పరిచే ఎన్నో పాటలను రచించారని ఆయన నిరంతరం పేద బలహీన వర్గాల పక్షాన నిలబడి పోరాటం సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన సాహిత్యం ఎంతో మంది వర్ధమాన కవులకు స్ఫూర్తిగా నిలిచిందని అన్నారు.ఈ సందర్భంగా జయరాజ్ తాను రచించిన పుస్తకాలను స్థానిక పలువురి సాహితీవేత్తలకు అందజేశారు. కార్యక్రమంలో కళావేదిక ప్రతినిధులు బైరోజు చంద్రశేఖర్, డా. బండారు శ్రీనివాస్, డా. నరేష్ కుమార్, డా. శ్యాం సుందర్, ఉప్పరి తిరుమలేష్, రచయితలు డా. వీరయ్య , పద్మావతి, డా. కంటే నిరంజనయ్య, మధుకర్, కిరణ్ కుమార్, దర్శన్ కుమార్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : శ్రీలత రాఘవేందర్



ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్ అభ్యర్థి శ్రీలత రాఘవేందర్

ఖిల్లాఘణపురం ,డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మానాజీపేట గ్రామ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని పానుగంటి శ్రీలత రాఘవేందర్ తెలిపారు. మండలంలోని మానాజీపేట పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారు సర్పంచ్ అభ్యర్థి పానుగంటి శ్రీలత రాఘవేందర్ ఇంటింటికి తిరుగుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో వైద్య సేవ అందించడానికి అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. మానాజీపేట, కొత్తపల్లి తండాల్లో తాగునీటి సమస్య పరిష్కరిస్తానన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం ప్రతీ కుటుంబానికి అందజేస్తాం. అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, కొత్తగా పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గతంలో గ్రామ యువకులకు క్రీడా సామాగ్రి ఆట దుస్తులు అందించినట్లు గుర్తు చేశారు. గ్రామంలోని యువత క్రీడా నైపుణ్యాలు మెరుగుపరచడానికి క్రీడా మైదానం నిర్మిస్తానన్నారు. డ్రైవర్ల కుటుంబాలకు భరోసా కల్పిస్తు అండగా నిలిచినట్లు తెలిపారు. సర్పంచ్‌గా గెలిపిస్తే ఎమ్మెల్యే మేఘారెడ్డి సహకారంతో గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల ప్రజలకు పథకాలు అందించి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.